


## (దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

### 126

(15' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**గత వ్యాసంలో** మిత్రుడు చేసిన పొరపాటును గురించి ప్రస్తావించాను. అతడొకసారి మద్రాసులో కాబోలు తన సోదరివున్న యింటికి వెళ్ళాడుట. వాకిట్లో బండి దిగి చనువుగా లోపలకు వెళ్ళాడుట.

వెళ్ళగానే అక్క కనిపించలేదు. సావిట్లోకి వెళ్ళి 'అక్కయ్యా' అని పిలిచాడు. ఆమె వినిపించుకోలేదు. తెలిసిన ఇల్లే గనుక గదిలోకి తొంగి చూశాడుట. మంచం మీద కిటికీవైపు తిరిగి పరున్న ఆవిణ్ణి చూశాడు. 'పాపం నిద్రపోతోంది' అనుకున్నాడు.

అయినా అక్కయ్యను పలకరించకుండా ఎలా వుంటాడు. తెచ్చిన పళ్ళు, పువ్వులూ చేత్తో తీసుకుని గదిలోకి రెండు అడుగులు వేసి 'అక్కయ్యా నే తమ్ముణ్ణి ఇప్పుడేవచ్చా. ఇవిగో పళ్ళూ, పువ్వులూ తెచ్చా. తీసుకో. అలా పడుకున్నావేం? ఒంట్లో బాగుండలేదా? ' అన్నాడుట.

ఈ కేకలకి అటు తిరిగి పరున్న ఆవిడ ఇటు తిరిగి చూచి ఉలిక్కిపడిందిట. కానీ అక్కయ్య అని పిలవడం పళ్ళూ, పువ్వులు చేత్తో పుచ్చుకొని నిలబడటం చూసి ఆవిడ "ఎవరు మీరు?" అందిట. అప్పటికి మా మిత్రుడు ఆమె తన సోదరి కాదని గ్రహించాడు.

వెంటనే అన్నాడుట "క్షమించాలి మా అక్కయ్య అనుకున్నాను. ఇదివరలో వాళ్ళు ఇంట్లో వుండేవారు. ఇల్లు మారినట్లు నాకు ఉత్తరం వ్రాయలేదు. రాగానే అక్కయ్యను పలకరించాలనే సంతోషంతో అలా పిలిచాను" అన్నాడుట వెనక్కి తిరిగి వస్తూ.

ఆవిడ ఇవతలకు వచ్చి సావిట్లో వున్న కుర్చీలో అతణ్ణి కూర్చోమని "మేము క్రొత్తగా ఈ ఇంట్లోకి వచ్చాం. మీ వాళ్ళు మరో పేటకు వెళ్ళారు. ఎడ్రసు నాకు చెప్పిపోయారు. ఇస్తాను. మీరు అక్కయ్యా అని పిలవడంవల్ల మా తమ్ముడొచ్చినంత సంతోషం అయింది. నేనూ మీ అక్కనే" అందిట నవ్వుతూ.

మా మిత్రుడు ఎంతో సంతోషించి "చాలా మంచిమాట అన్నారు. మీతో నాకు ముగ్గురు అక్కయ్యలన్నమాట. ఈ పువ్వులు, పళ్ళు తీసుకో అక్కయ్యా. ఎడ్రసిస్తే వెళ్ళి రేపు మా అక్కయ్యను కూడా తీసుకొస్తాను. బావను కూడా చూస్తాను" అని సంబరాలు పడ్డాడుట.

"అయితే నీతో నాకు ఆరుగురు సోదరులు. ఎడ్రసిస్తాను" అని లోపలికి వెళ్ళి ఎడ్రసు వ్రాసి తెచ్చి "రేపు తప్పకుండా రావాలి తమ్ముడు" అందట.

"రేపేమిటి అక్కయ్యా నే బ్రతికి వున్నన్నాళ్ళూ వస్తాను. అక్కయ్యను మరిచిపోతానా? అక్కయ్యా నీ పేరేమిటి?" అన్నాడుట.

"పేరు దేనికిలే మీరు ఆంధ్రులులాగా వున్నారు. నన్ను 'కన్నడ అక్కయ్య' అను, నిన్ను 'తెలుగు తమ్ముడు' " అంటానందిట. ఇద్దరూ కాసేపు నవ్వుకున్నారుట. అప్పటినుంచి వారికి బాంధవ ముద్ర ఏర్పడింది. అనుకోని పొరపాటువల్ల.

ప్రముఖ వ్యాస రచయిత జార్జి అనే ఆయనగా వ్రాశాడు ఇలాంటి సంఘటన ఒకటి. ఒకసారి అతడు మరో పేటలో వున్న ఒక ముసలమ్మ కేదో వార్త చెప్పాలని బయలుదేరాడట. పరధ్యానంలో వెడుతూ మరో యింటి తలుపు కొట్టాడుట. ఎవరో వచ్చి తలుపు తీశారు. తీరా చూస్తే ఆ ఇంట్లో ఏవో జలసాగా నృత్యాలు వగైరా చేస్తున్నారుట.

ఇతగాడు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి రాబోయాడుట. కానీ ఆ జలసాగాళ్ళు అతని చెయ్యి పుచ్చుకుని చరచరా లోపలికి లాక్కుపోయి వాళ్ళతో పాటు గంతులు వెయ్యమన్నారుట. ఆ పూటంతా అతడు ఆవిధంగా గడిపాడు. ముసలమ్మకు చెప్పవలసిన వార్త మనస్సుల నుంచి జారిపోయిందిట.

చెయ్యదలిచిన పని చెయ్యలేకపోయినా ఆ రోజు వారు చేసిన బలవంత ఆహ్వానం వల్ల వారిలో కొందరు ఆప్తమిత్రులయ్యారనీ, ఇప్పటివరూ ఆ మైత్రి అలా సాగుతోందనీ వ్రాశాడాయన.

---

బందరులో కరణంగారని ఒక మిత్రుడుండేవాడు. ఆయనగారు చాలా చమత్కారి ఎప్పటికప్పుడు పుట్టెడు హాస్యం పండించగల శక్తి వున్నదాయనగారికి. పొరపాటును గురించిన ఒక వృత్తాంతం చెపుతూ వుండేవారు. వారి కథనం ఇది.

ఉదయంపూట కూరలు తెద్దామని ఒక పావలా తీసుకుని బయలుదేరేవాణ్ణి. కానీ దారిలో పొరపాటున కాఫీ హోటల్‌లోకి వెళ్ళేవాణ్ణి. పావలా బిల్లుకు సరిపడ్డది ఆరగించేవాణ్ణి, అక్కడనుంచి కృష్ణాపత్రిక ఆఫీసుకి వచ్చేవాణ్ణి అక్కడి వారంతా భోజనానికి బయలుదేరితే తప్ప నాకు భోజనం మాట జ్ఞాపకం వచ్చేది కాదు.

ఇంటికి వెళ్ళగానే మా ఆవిడ "ఇంతసేపు ఎక్కడున్నారండీ. కూరకోసం కుంపటి ఆర్పకుండా కూర్చున్నాను" అనేది.

"ఇప్పుడేం చెప్పి ఏంలాభం? ఏ పచ్చడో వేసి అన్నం పెట్టు" అనేవాణ్ణి.

"పచ్చడి వేసి పెట్టడానికైతే ప్రొద్దున్నే పావలా యిచ్చి పంపడం దేనికండీ. అసలేమైంది పావలా? " అనేదావిడ.

"పావలా పోయింది. అంటే కూరకొనడానికి పనికిరాకుండా పోయింది" అనేవాణ్ణి.

"అంటే పడని పావలా అంటారా?" అని ఆవిడ ప్రశ్న.

"పడకేం చక్కగా పడుతుంది. కూరల దుకాణంలో పడలా. కాఫీ హోటల్‌లో పడింది. అదంతా ఎందుకూ ముందు అన్నంపెట్టు" అని నేను.

"కాఫీ హోటల్‌లో పడటమేమిటండీ? ఖర్మ! " అని ఆవిడ పిచ్చిగా చూసేది.

"ఏంలేదు. కూరల బజారుకి బయలుదేరిన వాణ్ణి. పొరపాటున కాఫీ హోటల్లోకి వెళ్ళాను. ఆకలి ముఖం ఏదో తినేశాను. ఎలాగూ తిన్నాగదా అని అలా తిరిగి వచ్చాను. " అని నేననేవాణ్ణి.

"అలా తిని తిరుగుతుంటే నాకేం తెలుస్తుందండీ. తిరగమాత గింజలు దగ్గర పెట్టుకుని రెండు గంటలనుంచీ కూర్చున్నాను. పోనీ కాఫీ హోటల్‌కి వెళ్ళానని చెపితే పోయేదిగా. "

"ఎలా చెప్పేది మన యింటికి పోనా ఏమన్నానా? ఎప్పటికైనా కాళ్ళీడ్చుకుంటూ నే వచ్చి చెప్పవలసిందేగా" అని నా సమాధానం ఇలాంటి పొరపాట్లు రెండు మూడుసార్లు చేశాను. దాని ఫలితంగానే వేమన చెప్పిన తిండి (కూరలేని తిండి కుక్క తిండి) తిన్నాను - అనేవారాయన.

------

ఇలా ఇంటిదగ్గిర రెండు మూడుసార్లు సంజాయిషి చెప్పుకోవడం జరిగిన తర్వాత కొంతకాలం ఆయనగారు కూర విషయంలో జాగ్రత్త వహించేవారు. కూరడబ్బులు అయ్యరు హోటల్‌కి చేరకుండా ముందే కూరలు కొనేవారు.

ఒకరోజున రెండు పెద్ద పొట్లకాయలు చేత్తో పుచ్చుకుని కాఫీ హోటల్‌లోకి వచ్చి వాటిని బల్లమీద పరిచారు. వెంటనే సర్వర్ని పిలిచి "ఇవ్వాళ డబ్బులు లేవు. పొరపాటున పొట్లకాయలు కొనేశాను. తేవడం మీకోసమే తెచ్చాను. కానీ అలా జరిగిపోయింది త్రోవలో. మీ యజమానితో చెప్పు ఇవ్వాళ ఫలహారం వద్దు. వ్రాసుకోవలసి వస్తుందని. సాక్ష్యం కావలిస్తే పొట్లకాయలున్నాయని చెప్పు. త్వరగా ఇడ్లీ తీసుకురా." అనేవారు.

ఇలా ఒకచోట పొరపాటును మరోచోటకు మార్చి తాత్కాలికంగా కాలక్షేపం చేసేవారు. మొత్తమ్మీద పొరపాట్లకు సంబంధించిన కథలు చాలావుంటాయి. కొన్ని పొరపాట్లు రాజ్యాల్నే కదిలించినాయి. కొన్ని వ్యక్తిత్వాలనే నాశనం చేశాయి.

పొరపాటు మానవజీవితంలో తప్పదని మాత్రం. అంతమాత్రాంతో పొరపాట్లు చెయ్యవచ్చునికాదు. అసలు తెలిసీ చేస్తే పొరపాటు ఎలా అవుతుంది? గాంధీజీ ఒకసారి అన్నారు. చిన్నిచిన్ని పొరపాట్లు చేయడానికి అవకాశం లేని స్వాతంత్ర్యానికి విలువ ఏం వుంటుంది? అని. ఈ వాక్యం ప్రపంచమంతటా ప్రచారం సాధించిందానాడు.

Post your comments